

రామేశంమెట్టలో తరలిపోతున్న మట్టి(ఫైల్)

# అవినీతికి.. 'కొండంత' అండ!

- పెద్దాపురం రామేశంమెట్టను అధికారం అండతో గుల్ల చేసేసిన గత వైసీపీ పాలకులు
- అయిదేళ్లలో అక్రమ తవ్వకాలతో రెండు చేతులా సంపాదించింది రూ.250కోట్లపైమాటే..
- అనుమతుల్లేకుండా కోట్లాది క్యుబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్‌ను ఎడాపెడా మింగేసిన వైనం
- కానీ అయిదేళ్లలో తవ్వింది చాలా తక్కువేనంటూ గనులశాఖ అడ్డగోలు బుకాయింపు
- కేవలం 5.28లక్షల క్యుబిక్‌మీటర్లేనంటూ కాకి లెక్కలు: రాయల్టీ రూ.1.68కోట్లు వచ్చేసిందట
- లోకాయుక్తకు ఫిర్యాదు వెళ్లడంతో అక్రమాల తీవ్రత తగ్గించి చూపేందుకు తంటాలు
- కొండలు మాయమై లోయలు ఏర్పడ్డా అసలే మాత్రం అక్రమాలు లేవనేలా నివేదికలు
- మరోపక్క అసైన్డ్ భూములను గుల్లచేసి లోయలుగా మార్చేసినా కన్నెత్తి చూడని వైనం
- ప్రభుత్వానికి రూ.70కోట్లకుపైగా రాయల్టీ ఆదాయానికి గండిపడ్డా బేఖాతరు
- 823 ఎకరాల్లో ఎంతమేర తవ్వింది తేల్చడానికి సర్వే చేయాల్సి ఉన్నా తప్పించుకునే ధోరణి



పెద్దాపురం మండలం రామేశంమెట్టలోని కొండల్లో తవ్వకాలు(ఫైల్)

**పెద్దాపురం రామేశంమెట్టను గత వైసీపీ పాలనలో గుల్ల చేసేశారు. 823ఎకరాల్లో కొండలను మాయం చేసేసి లోయలు సృష్టించారు. ఒకటికాదు రెండు కాదు ఏకంగా అయిదేళ్లపాటు కోట్ల క్యుబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్‌ను అప్పటి కాకినాడ వైసీపీ కీలక నేత మింగేశారు. అనుమతుల్లేకుండా అధికారం అండ తో విచ్చలవిడిగా తవ్వకాలు జరిపారు. అప్పటి జిల్లా కలెక్టర్లు, గనులశాఖ అధికారుల అండదండలతో రెచ్చిపోయారు. ఇక్కడి నుంచి నిత్యం వేలాది టిప్పర్లలో తరలించారు. రియల్ ఎస్టేట్ అవసరాల దగ్గర నుంచి పేదల ఇళ్లస్థలాల చదును వరకు సదరు నేత దర్జాగా మట్టి అమ్మకాలు సాగించి అయి దేళ్లలో రూ.250కోట్లకుపైగా సంపాదించారు. ఇంత జరిగినా గనులశాఖ మాత్రం ఇంకా బొంకుతూనే ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రామేశంమెట్ట పాపాలు బయటపెట్ట కుండా బుకాయిస్తూనే ఉంది. తవ్వింది చాలా తక్కువేనంటూ కాకిలెక్కలు చెబుతోంది.**

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

రామేశంమెట్టలో అక్రమ తవ్వకాలపై పెద్దాపురానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల లోకాయుక్తను ఆశ్రయించడంతో నిజాలు దాచేసేందుకు గనులశాఖ తెగ ప్రయత్నిస్తోంది. సద రు వైసీపీ నేత పాపాలు బయటపడకుండా దొంగలెక్కలు చూపిస్తోంది. గనులశాఖకు రూ.70కోట్లకు పైగా రాయల్టీకి గండిపడినా అదేం లేదని, తవ్వింది కేవలం 5.28 లక్షల క్యుబిక్ మీటర్లేనంటూ నిస్సిగ్గుగా బొంకుతోంది. రాయల్టీ రూ.1.68కోట్లు వచ్చేసిందని గప్పాలు కొడుతోంది. అసైన్డ్ భూములను సైతం లోయలుగా మార్చేసినా వాటి ప్రస్తావనే లేకుండా, అసలు తవ్విదెంతో తేల్చడానికి సర్వే కూడా చేయకుండా కాకమ్మ కబుర్లు చెబుతోంది.

## ఎంత రెచ్చిపోయారో..

పెద్దాపురం, గండేపల్లి మండలాల్లో 823 ఎకరాల్లో రామేశంమెట్ట విస్తరించి ఉంది. ఇక్కడ సర్వే నెంబరు 1నుంచి 90 వరకు ఉన్న వందల ఎకరాల భూముల్లో కొంతప్రాంతం రిజర్వ్‌ఫారెస్ట్ కూడా ఉంది. వైసీపీ అధికారంలోకి రాగానే కాకినాడ కీలకనేత రామేశంమెట్టపై వాలిపోయారు. అసలే ఆయన అప్పటి సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరుండడంతో అధికారం అండతో

> **ఎడాపెడా తవ్వకాలు**
>
> ఒకరకంగా చెప్పాలంటే వైసీపీ పాలనలో అయిదేళ్లపాటు రామేశంమెట్టలో 823 ఎకరాలను ఎడాపెడా తవ్వి పారేశారు. పెద్దపెద్ద కొండలను సైతం గుల్ల చేసేసి వాటిని మాయం చేసేశారు. భూమి ఉపరితలం నుంచి 50 అడుగుల లోతులో గ్రావెల్ ఊడ్చేశారు. దీంతో ఇప్పుడా ప్రాంతంలో వందల ఎకరాల్లో కొండలు, గుట్టలు మాయమై పోయి వాటిస్థానంలో లోయలు ఏర్పడ్డాయి. వాస్తవానికి ఏదైనా కొండలు, గుట్టల్లో గ్రావెల్ తవ్వాలంటే గనులశాఖనుంచి అనుమతులు తీసుకోవాలి. ఇందుకు రెవెన్యూశాఖ నుంచి అంగీకారం ఉండాలి. తీరా తవ్వకాలకు అనుమతులు ప్రైవేటు అవసరాలకు ఇవ్వరు. ఒకవేళ ఒత్తిడితో ఇచ్చినా నిర్దేశిత ప్రాంతంలోనే తవ్వాలి. తవ్విన దానికి ప్రతి రోజూ ఎంత తవ్వారు? ఎంత తరలించారు? వంటి వివరాలు లాగ్‌బుక్‌లో నమోదు చేయాలి. కానీ ఇక్కడ అవేవీ లేకుండా సదరు నేత ఎడాపెడా 823 ఎకరాలను తవ్విపారేశారు. రోజూ ఎంత తవ్వ తున్నారు? తవ్విన గ్రావెల్ ఎక్కడికి తరలుతోంది? అనేదానిపై అసలు గనులశాఖ పట్టించుకోవడమే మానేసింది.

రామేశంమెట్టలో వందల ఎకరాల్లో కొండలను పిండేశారు. జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, కోనసీమ, యానాం తదితర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్, రహదారుల నిర్మాణ అవసరాలకు మట్టి, గ్రావెల్‌కు భారీ డిమాండ్ ఉండడంతో పేదల ఇళ్లస్థలాల చదును ముసుగులో కొండలపై వాలిపోయారు. అదే సమయంలో వందలాది ఇళ్లస్థలాల లేఅవుట్‌లను మట్టి, గ్రావెల్‌తో చదును చేయాల్సి ఉండడంతో తాత్కాలికంగా కొంతగ్రావెల్‌ను ఇక్కడినుంచి తరలించడానికి కలెక్టర్ సహకారంతో సదరు కీలకనేత తాత్కాలిక అనుమతులు తీసుకున్నారు. ఈ ముసుగులో ఇక్కడున్న కొండలు, గుట్టల్లో కోట్ల క్యుబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్ తవ్వేశారు.

## ఇళ్లస్థలాల లేఅవుట్‌ల విక్రయం

సదరు కాకినాడ కీలక నేత రాష్ట్ర ముఖ్య నేత అనుచరుడు కావడంతో జిల్లాలో మొత్తం అధికార వ్యవస్థ దాసోహం అంది. దీంతో ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు సదరు నేత ఇక్కడ సాగించిన ఆగడాలకు హద్దే లేదు. ఆయన లారీలు, టిప్పర్లు రామేశంమెట్టనుంచి రోజూ వందల్లో వెళ్తుంటే పోలీసుశాఖకు ఆ టిప్పర్ల నెంబర్లు ఇచ్చి ఎవరూ అడ్డుకోకుండా అధికార వ్యవస్థలు సాగిలపడ్డాయి. ఈక్రమంలో సదరునేత రామేశంమెట్ట మట్టి, గ్రావెల్ విక్రయాలతో రూ.250కోట్లకు పైగా ఆర్జించారు. తవ్వడం, తవ్వింది రియల్ ఎస్టేట్ అవసరాలకు, పేదల ఇళ్లస్థలాల లే అవుట్‌లు విక్రయించి మొత్తం సంపాదించింది అయితే ఏకంగా రూ.450కోట్లకుపైనే. ఒక్క కొమరగిరి ఇళ్లస్థలాల లేఅవుట్‌లో చదును పనుల్లోనే రూ.35కోట్లకుపైగా సంపాదించారు. రామేశంమెట్టలో గతంలో దళితులకు సాగుకోసం ఇచ్చిన భూములను సైతం లీజుకు తీసుకుని వాటిని సైతం లోయలుగా మార్చేశారు. ఎకరాకు రూ.10లక్ష లు చొప్పున చెల్లించి ఎకరం భూమిలో పాతిక అడుగుల లోతుకు మట్టి, గ్రావెల్ తవ్వి తరలించుకుపోతారు. ఎకరా భూమిలో మట్టి తవ్వకాలకు రైతుకు రూ.10లక్షలు చెల్లించి సదరు నేత రూ.25లక్షలకుపైగా మట్టి అమ్మకాలతో సంపాదించుకున్నారు. అయినా ఏనాడు గనులశాఖ ఇక్కడ తనిఖీలు చేయలేదు. ఇలా ఈ ఐదేళ్లలో కోట్ల క్యుబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్ రామేశంమెట్ట నుంచి తరలిపోయింది. తద్వారా గనులశాఖకు రాయల్టీ రూపంలో రూ.70కోట్లకుపైగానే గండిపడింది.

## తవ్వింది తక్కువేనంట..

ఒకపక్క రామేశంమెట్టను సదరు కాకినాడ కీలకనేత గుల్ల చేసి కోట్ల క్యుబిక్‌మీటర్ల మట్టి, గ్రావెల్ తన్నుకుపోతే జిల్లా గనులశాఖ మాత్రం అబ్బే అదేం లేదంటోంది. నిజాలు అంగీకరిస్తే తమ పాపాలు బయటకు వస్తాయన్న భయంతో అసలు నిజాలను దాచేస్తోంది. 2019 నుంచి 2024 వరకు టెంపరరీ పర్మిట్ల రూపంలో తాము కేవలం 5.28లక్షల క్యుబిక్ మీటర్ల మట్టి, గ్రావెల్ తవ్వకాలకే అనుమతులు ఇచ్చినట్లు కాకి లెక్కలు చెబుతున్నారు. 2019లో 1.60లక్షల క్యుబిక్ మీటర్లు, 2020లో 3.02లక్షలు, 2021లో 35,669, 2022లో 29,124, 2023లో 1,59,730 క్యుబిక్‌మీటర్ల తవ్వకాలకే అనుమతులు ఇచ్చామని చెబుతున్నారు. అటు రాయల్టీ గనులశాఖకు ఈ మొత్తం కాలంలో రూ.1.68కోట్లు వచ్చేసిందని చెబుతున్నారు. వాస్తవానికి ఈ అయిదేళ్లలో అక్రమ తవ్వకాలతో గనులశాఖకు రాయల్టీ రూపంలో పోయిన ఆదాయం రూ.70కోట్లపైమాటే. ఇంత ఆదాయం పోయినా సదరు గనులశాఖ కీలక అధికారులకు మాత్రం తెరవెనుక ముట్టింది భారీగానే. అందువల్లే ఏనాడు ఇక్కడకు వచ్చి అక్రమ తవ్వకాలను పరిశీలించిందే లేదు.

> **లోకాయుక్తకు ఫిర్యాదు**
>
> రామేశంమెట్టలో అక్రమ తవ్వకాలపై రెండున్నరేళ్ల కిందట పెద్దాపురానికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. కానీ సదరు కీలక నేత మనుషులు ఆ కేసు విచారణకు రాకుండా ముందే వలుకుబడి ఉపయోగించారు. ఇటీవల పెద్దాపురం ఉలిమేశ్వరానికి చెందిన ఓ వ్యక్తి ఏకంగా లోకాయుక్తను ఆశ్రయించారు. రామేశంమెట్ట తవ్వకాల్లో కుంభకోణం జరిగిందని, మీడియా కథనాలు రాస్తున్నా అధికారుల్లో చలనం లేదని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో లోకాయుక్తనుంచి గనులశాఖకు తాఖీదులు అందాయి. దీంతో అక్రమ తవ్వకాలు జరిగాయని అంగీకరిస్తే ఉద్యోగాలు పోతాయనే భయంతో కాకి లెక్కలతో లోకాయుక్తను మోసం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అసలు ఈ ఐదేళ్లలో తవ్వింది చాలా తక్కువేనని బుకాయిస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఎన్ని ఎకరాల్లో తవ్వారనేది తేలితే అసలు బండారం బయటపడే ప్రమాదం ఉండడంతో రామేశంమెట్టలో మొత్తం భూముల్లో సర్వే చేయాల్సి ఉన్నా అదేం చేయడం లేదు. సిబ్బంది కొరత సాకుతో తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రామేశంమెట్టలో గ్రావెల్ అక్రమాలు బయటపడకుండా ఉండేలా లోకాయుక్త కళ్లకు గంతలు కట్టడానికి అన్నిరకాల గనులశాఖ అధికారులు వ్యూహాలు రచిస్తున్నారు.

---

## మధ్యాహ్న భోజన పథకంలో..

# విద్యార్థులకు పాడైన కోడిగుడ్లు



గండేపల్లి మండలం తాళ్లూరు హైస్కూల్‌లో పాడైన కోడిగుడ్లు

గండేపల్లి, ఆగస్టు 27: గండేపల్లి మండలం తాళ్లూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పాడైన కోడిగుడ్లు వడ్డించారని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల ఆవరణలో ఆందోళనకు దిగారు. నాణ్యతలేని భోజనం వడ్డించడంవల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని హెచ్‌ఎం, వంట నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రోజూలాగే విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసి ఇంటికి వెళ్లగా వారి కడుపులో గడబిడిగా మారి ఇబ్బంది పడ్డ విషయం తల్లిదండ్రులకు తెలిపారు. దీనిపై వారు ఆరా తీయగా భోజనం చేశాక ఇలా అయ్యిందని తెలపడంతో పాఠశాలకు వచ్చి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అప్పటికే కోడిగుడ్లు పాడై ఉండడంతో ఆగ్రహంతో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను నిలదీశారు. రెండునెలలుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, భోజనంలో పెంకు పురుగులు కూడా ఉంటున్నాయని ప్రశ్నిస్తే టీసీ తీసుకుని వెళ్లిపోమంటున్నారని వారు ఆరోపించారు. వంట నిర్వాహకులు మాత్రం సక్రమంగా వండుతున్నామని, గుడ్ల కాంట్రాక్ట్‌లోనే తేడా అవుతోందని తెలిపారు. ఈ విషయం తెలిసిన సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉపసర్పంచ్ పైణ్ణి వెంకటేశ్వరరావు హైస్కూల్‌కు చేరుకుని గుడ్లు పరిశీలించగా అవి పాడైపోయాయని నిర్ధారించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు.

### సరిగ్గా స్పందించని ఎంఈవో

ఈ విషయాన్ని ఎంఈవో నాయక్‌కు విద్యార్థుల తలిదండ్రులు ఫోన్‌లో వివరించారు. దీంతో ఆయన హెచ్‌ఎంతో మాట్లాడగా ఎటువంటి సంఘటన జరగలేదని చెప్పారన్నారని, ఎంఈవో కనీసం సంఘటనా స్థలానికి కూడా చేరుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

## అన్నవరం సత్యదేవుడి ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

- ధ్రువపత్రాన్ని ఆవిష్కరించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ (7లో)



ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు ధ్రువపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

## ఏలేశ్వరంలో 72మంది విద్యార్థినులకు అస్వస్థత (7లో)

- గురుకుల పాఠశాల వసతిగృహంలో కలుషితాహారమే కారణం.. కలెక్టర్ పరామర్శ



ఏలేశ్వరం ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే సత్యప్రభ

# బదిలీలతో కలెక్టరేట్‌లో కోలాహలం

- పెద్దసంఖ్యలో దరఖాస్తు చేస్తున్న ఉద్యోగులు

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 27: జిల్లాలో ఉద్యోగుల బదిలీలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. జాబితాలు రూపకల్పన జరుగుతోంది. ఈ నేపథ్యంలో బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారం పెద్దసంఖ్యలో రెవెన్యూ ఉద్యోగులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. దీంతో కలెక్టరేట్ కోలాహలంగా కనిపించింది. రెవెన్యూ విభాగంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, గ్రామ రెవెన్యూ అధికారులు ఇక్కడే దరఖాస్తు చేస్తున్నారు. ఐదేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులు, స్పౌజ్‌కోటా, వికలాంగుల కోటా, మెడికల్‌గ్రౌండ్స్ ఉన్నవారు ప్రత్యేకంగా దరఖాస్తు చేస్తున్నారు. ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి జాబితా రూపొందించి ఈనెల 31వతేదీకి బదిలీ చేయాల్సిఉంది. వేలాదిమంది ఉద్యోగుల బదిలీ ప్రక్రియ కావడంతో మరో 15రోజులు గడువు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో అత్యంత కీలకమైన శాఖల్లో బదిలీలు మార్గదర్శకాలను అనుసరించి జాబితాలు సిద్ధం చేస్తున్నారు. ఇతర జిల్లాలకు బదిలీలు చేసే కమిటీకి జిల్లా కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. పలుశాఖల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగులకు ఈసారైనా కదుపుతారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వెలుగు జిల్లా కార్యాలయంలో ముగ్గురు అధికారులు 15ఏళ్లుగా తిష్ఠ వేసుకుని ఉన్నారు.

### బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి: కలెక్టర్ షాన్‌మోహన్

ఉద్యోగుల బదిలీ ప్రక్రియను పారదర్శకంగా, సక్రమంగా చేపట్టాలని కలెక్టరు షాన్‌మోహన్ ఆదేశించారు. ఉద్యోగుల బదిలీల పక్రియపై జిల్లా కలెక్టరు కార్యాలయంలో జాయింట్ కలెక్టరు రాహుల్ మీనాతో కలిసి మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

## 31 వరకు జాతీయ క్రీడా ఉత్సవాలు

కలెక్టరేట్/కాకినాడ అర్బన్, ఆగస్టు 27: ఈనెల 27 నుంచి 31 వరకు కాకినాడ జిల్లా స్పోర్ట్స్ క్రీడా మైదానంలో నేషనల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. మంగళవారం క్రీడాకారుల ప్రతిజ్ఞ, బాలబాలికలకు వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో క్రీడా ప్రతిజ్ఞలో హాకీ క్రీడాకారులతోపాటు పిఠాపురం, విరవ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 28న స్పోర్ట్స్ ఈవెంట్స్ 18 నుంచి 40ఏళ్ల లోపుగల వారికి 100 మీటర్ల రన్నింగ్, బ్రిస్క్ వాక్, వాలీబాల్, త్రోబాల్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, చెస్, షటిల్ నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 40నుంచి 60ఏళ్ల వారికి 50 మీటర్ల రన్నింగ్, 300 మీటర్ల వాకింగ్, టగ్ ఆఫ్ వార్, ఇండోర్ గేమ్స్, షటిల్ నిర్వహిస్తామన్నారు. 60పైబడిన వారికి 30-50 మీటర్ల వాకింగ్, యోగా తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. 29న చిల్డ్రన్స్ కోసం పలు రకాల క్రీడలు, 29 నుంచి 31వరకు వివిధ డిపార్ట్‌మెంట్లలో గేమ్స్, పురుషులకు, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తామని తెలిపారు. 30, 31వ తేదీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు క్విజ్ అండ్ ఎస్సే రైటింగ్‌పోటీలు నిర్వహిస్తామన్నారు.

## పెండింగ్ కేసులు, గంజాయి రవాణాపై చర్యలు తీసుకోవాలి: ఎస్పీ



నేరసమీక్ష నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, ఆగస్టు 27: జిల్లాలో ఉన్న పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గంజాయి, నాటుసారా రవాణాపై ఉక్కు పాదం మోపాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయం సమావేశం మందిరంలో మంగళవారం నిర్వహించిన నెలవారీ నేరసమీక్షలో ఆయన మాట్లాడారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రత పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. చోరీల నియంత్రణ, ఆస్తుల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా అణచివేయాలన్నారు. సివిల్ తగాదాలు, సెటిల్‌మెంట్ల జోలికి వెళ్లినట్లు పోలీసులపై ఫిర్యాదులు వస్తే ఏ మాత్రం ఉపేక్షించిది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు కేసులపై సమీక్ష నిర్వహించి సలహాలు ఇచ్చారు. సమావేశంలో ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్ఈబీ ఏఎస్పీ కె.శ్రీలక్ష్మి, కాకినాడ ఎస్డీపీవో రఘువీర్ విష్ణు, పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


### సీసీఆర్‌సీ కార్డుల జారీ వేగవంతం చేయాలి: జేసీ రాహుల్ మీనా

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 27: జిల్లాలో కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలో వ్యవసాయశాఖ కార్యకలాపాలపై మంగళవారం ఆయన సమీక్షించారు. జిల్లాలో సాగవుతున్న పంటలు, వాటి సాగు విస్తీర్ణం, సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ, ఈక్రాప్ నమోదు తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలో ఇప్పటివరకూ 54,894 కార్డులు పంపిణీ చేశామన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను సక్రమంగా ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. 72శాతం మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ పూర్తయిందని, నూరుశాతం పూర్తి చేయాలని చెప్పారు.

## విస్తృతంగా రోగ నిర్ధారణ పరీక్షలు

- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి అధికారులు

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 27: జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకోసం విస్తృతంగా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, నివారణ కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఒక ప్రకటనలో తెలియజేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'జ్వరంతో గజగజ' కథనంపై వివరణ ఇచ్చారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 1,29,367 మందికి పరీక్షలు నిర్వహించగా ఇందులో ఐదు మలేరియా కేసులు నమోదు అయ్యాయన్నారు. 4115మందికి డెంగీ పరీక్షలు చేపట్టగా ఇప్పటివరకు 116 కేసులు నిర్ధారణ అయ్యాయన్నారు. ఈ ప్రాంతాల్లో వ్యాధుల నివారణ కోసం ఫీవర్ సర్వే, గాలిలోను, నీటిలో దోమల నివారణ మందుల పిచికారీ, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు ఆయా శాఖల ఆధ్వర్యంలో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే అమలు చేస్తున్నట్లు తెలిపారు.



మన ఆశయం పెద్దగా ఉండాలంటే ఆలోచనలు గొప్పగా ఉండాలి... అటువంటి ఆలోచనల నుంచి పుట్టిందే నా కవిత్వం.... అయితే దానికి ఆదర్శం ఈ సమాజం. సమాజం అంటే సహజ గుణంగా భావించే నేను అందులోని జనులతో సహా పలు జీవరాశులను పరిగణలోకి తీసుకుని పరిశీలించి నా కంటూ ఒక నడవడిక ఏర్పరచుకున్నాను. ఆ నడవడికే 27 ఏళ్లకే ఆరు పుస్తకాలు రాసేలా చేసింది.... 'కమిటీ కుర్రోళ్లు' సినిమాకు మాటల రచయితగా అవకాశం దక్కేలా చేసింది.

...కొండల్‌రావు




డైలాగ్ రైటర్

# వాడపాలెం కుర్రోడే

కొత్తపేట, ఆగస్టు 27: మెగా ప్రిన్సెస్ నిహారిక కొణిదల నిర్మాతగా ఈ నెల 9న విడుదలై బ్లాక్ బాస్టర్ హిట్ అయిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం డైలాగ్ రైటర్ కోనసీమ కుర్రోడే. అతడే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం మునసబు గారి వీధికి చెందిన అడ్డగళ్ళ ఆంజనేయులు మనుమడు కొండల్‌రావు. హిస్టరీలో పీజీ చేసిన ఇతడు రచనల పట్ల ఆసక్తితో ఇప్పటి వరకు ఆరు కథలు రచించాడు. 'కమిటీ కుర్రోళ్లు' సినిమా డైరెక్టర్ వంశీ... కొండలరావును సంప్రదించగా కథకు ఊపిరిపోస్తూ మాటలు అందించాడు. ఈ సినిమా బ్లాక్ బాస్టర్ కావడంతో కొండల్ రావుకు అవకాశాలు రావడం మొదలు పెట్టాయి. మెగాస్టార్ చిరంజీవి, నాగబాబు, తనికెళ్ల భరణి, యండమూరి వీరేంద్రనాథ్, చంద్రబోస్ వంటి వారు కొండల్‌రావును పిలిచి అభినందించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కూడా అతడిని దుశ్శాలువాతో సత్కరించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని దీవించారు. ఈ సందర్భంగా కొండల్‌రావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మంచి కథలతో చలనచిత్ర రంగంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన అభిలాష అని చెప్పాడు.



కొండల్ రావ్ రచనలు



మెగాస్టార్ చిరంజీవితో...





ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నుంచి సత్కారం అందుకుంటున్న కొండల్ రావు (ఫైల)

← రచయిత విజయేంద్రప్రసాద్‌తో...

30న రత్నగిరిపై ఉచిత సామూహిక

## వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 27: శ్రావణ మాస ఆఖరు శుక్రవారం సందర్భంగా రత్నగిరిపై ఈ నెల 30న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఆరోజు ఉదయం 8 గంటలకు కొండపైకి చేరుకోవాలన్నారు. కొబ్బరికాయ, అరటిపళ్లు, పువ్వులను భక్తులు తీసుకొస్తే మిగిలిన ద్రవ్యాలు, వరలక్ష్మి రూపు, జాకెట్టుముక్క, గాజులు, ప్రసాదం దేవస్థానం అందజేస్తుందని పీఆర్వో కృష్ణారావు చెప్పారు.

1న అన్నవరంలో బాల్ బ్యాడ్మింటన్

## జిల్లా జట్ల ఎంపిక

అన్నవరం, ఆగస్టు 27: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న జిల్లాస్థాయి సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్ల ఎంపికలను అన్నవరంలో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు ముప్పన వీర్రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నవరం లోని సత్యదేవ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే ఎంపిక లకు 2009 జనవరి 2 తర్వాత పుట్టినవారు అర్హులు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, డ్రెస్‌కోడ్‌తో రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 99499 59951, 80082 66003 నంబర్లలో సంప్రదించాలి.

ఎన్‌సీసీ కమాండింగ్

## అధికారిగా ప్రవీణ్‌బాబు



జేఎన్టీయూకే, ఆగస్టు 27: ఎన్‌సీసీ కాకినాడ యూనిట్ కమాండింగ్ అధికారిగా పి.ప్రవీణ్ బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2000 జనవరి 1న ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌బాబు మాట్లాడుతూ యువత ఎన్‌సీసీలో చేరేందుకు ఆసక్తి చూపాలని, కాకినాడ యువ క్యాడెట్‌ల్లో క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తిని పెంపొందించడంలో కృషి చేస్తానన్నారు. అనంతరం వింగ్ కమాండర్ డీఎస్ఎన్ మూర్తి 9ఎయిర్ కమాండింగ్ అధికారి బాధ్యతలు అప్పగిస్తూ 9ఎయిర్ ఎన్‌సీసీతో తన అనుభవాన్ని తెలిపారు.

లోకో పైలట్‌కు 'జీఎం మ్యాన్ ఆఫ్ ది మంత్'

## సేఫ్టీ అవార్డు



రాజమహేంద్రవరం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్‌లో గూడ్స్ లోకో పైలెట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.శంకర్రావు మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ నుంచి 'జీఎం మ్యాన్ ఆఫ్ ది మంత్' సేఫ్టీ అవార్డు అందుకున్నారు. తేలప్రోలు-పెద అవుటపల్లి సెక్షన్‌లో డ్యూటీలో ఉన్న శంకర్రావు రైలు వెళ్తుండగా 457/11-9 వద్ద పెద్ద కుదుపు రావడం గమనించి వెంటనే ట్రాక్ తనిఖీ చేశారు. పట్టాల మధ్య వెల్డింగ్ వదిలేసినట్టు గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. ప్రమాదం తప్పడంతో ఆయన్ను అవార్డుకు ఎంపిక చేశారు. శంకర్రావును డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్, డివిజనల్, స్థానిక అధికారులు అభినందించారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి...

# కొబ్బరి రైతుల సమస్యలు

» భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్ మిశ్రా » ఈదరపల్లిలో పలు రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం » 2026ను కొబ్బరి సంవత్సరంగా ప్రకటించాలని డిమాండ్

అమలాపురం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్‌మిశ్రా పేర్కొన్నారు. గతంలో మాదిరిగా కొబ్బరిని లాభసాటి పంటగా మార్చే దిశగా రైతుల్లో తీసుకురావాల్సిన మార్పులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఈదరపల్లిలోని జనహిత కార్యాలయంలో మంగళవారం ఒడిసా, కేరళ, తమిళనాడు, కర్ణాటక, గోవా, బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తొలుత భరతమాత, బలరామకృష్ణుడు చిత్రపటాలకు పూజ చేశారు. జాతీయ కన్వీనర్ సుందర్‌రాజన్ జ్యోతి ప్రకాశనం చేయగా బీకేఎస్ పతాకాన్ని మిశ్రా ఆవిష్కరించారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకటరామవులు అధ్యక్షతన సదస్సును ప్రారంభించారు. పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధుల సూచనలను పరిగణలోకి తీసుకుని వాటిని తీర్మానాలుగా రూపొందించారు. అఖిల భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి, కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, అడ్డాల గోపాలకృష్ణ, జిన్నూరి బాబి, గోదశి నాగేశ్వరరావు, కొవ్వూరి త్రినాథరెడ్డి అనేక అంశాలను వివరించారు. కొబ్బరి ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు, మార్కెటింగ్ సౌకర్యాలను పెంపొందించేందుకు 2026ను కొబ్బరి సంవత్సరంగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. తీర్మానాలను తిక్కిరెడ్డి గోపాలకృష్ణ చదివి వినిపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, ఆర్వీ నాయుడు, మాకిరెడ్డి సత్తిబాబు, అప్పారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ మిశ్రా

**తీర్మానాలివీ...**

- రైతులకు మేలు చేసేలా కొబ్బరి బొడకాయ కిలో ధరరూ.45గా నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలి.
- కొబ్బరి దింపు సమస్య తీవ్రంగా ఉన్నందున ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీని ఉపయోగించి హార్వెస్టింగ్ చేసే యంత్రాలు తయారుచేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయాలి.
- మహిళా సంఘాలకు కొబ్బరి ఉప ఉత్పత్తులపై తర్ఫీదు ఇచ్చి మార్కెటింగ్ కల్పించేలా రాయితీలు అందించాలి.
- కొబ్బరి వినియోగం పెంచేందుకు అభివృద్ధి బోర్డు చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో ఇరియోఫిడ్ నల్లి తెగులుతో పాటు పలు తెగుళ్లను సామూహికంగా అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో దిగుబడులను పెంచడానికి మట్టి నమూనాలు పరీక్షించి మైక్రో న్యూట్రియంట్ ఎరువుల విధానం తక్కువ ఖర్చుతో అందించే విధంగా ఏర్పాటు చేయాలి.
- కొబ్బరినూనెలో కల్తీగా వాడే పారాఫిన్ ఆయిల్ కెర్నాయిల్‌పై నియంత్రణ ఉండడంతో పాటు అవసరమైతే కోనసీమలో కెర్నాయిల్ వినియోగాన్ని నిషేధించాలి.
- కొబ్బరి బోర్డు ద్వారా ఆర్‌అండ్‌ఆర్ స్కీమ్, రీప్లాంటేషన్‌లో రాష్ట్రంలో ఎక్కువ విస్తీర్ణంలో అమలయ్యేలా ప్రోత్సహించాలి.
- ప్యాక్ హౌస్ స్కీమును కొద్ది మార్పులతో రైతులకు కొబ్బరిని కురిడిగా తయారు చేసుకునేందుకు బాల్‌కొప్రా హౌస్ పేరుతో ఎక్కువ రాయితీపై అందించాలి.

**నేడు అమలాపురంలో జాతీయ కొబ్బరి రైతుల సదస్సు**

భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో బుధవారం అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బీకేఎస్ జాతీయ స్థాయి నాయకులు పాల్గొంటారు.






చోరీ జరిగిన ఇంట్లో క్లూస్ టీం తనిఖీలు, సీఐల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ దేవకుమార్

# బంగారం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ

» కొవ్వూరు ఉషశ్రీ అపార్ట్‌మెంట్‌లో ఘటన » 50 కాసుల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ » దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

కొవ్వూరు, ఆగస్టు 27: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో బంగారం వ్యాపారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. యజమానులు నిద్రిస్తుండగానే ఈ ఘటన జరగడం సంచలనం కలిగించింది. పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు వీధిలో నివాసముంటున్న ఉషశ్రీ జ్యూయలర్స్ యజమాని కట్టా ఉషశ్రీ అపార్ట్‌మెంట్లో దొంగలు పడ్డారు. మంగళవారం తెల్లవారుజామున 3-4గంటల మధ్యలో దుండగులు వెనుక ఇంటి పైనుంచి ఉషశ్రీ ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్రూమ్‌లో అందరూ నిద్రపోతుండగా వారి పక్కనే ఉన్న అల్మారా, బీరువాల్లో ఉంచిన 50 కాసుల బంగారు వస్తువులు, రూ.2 లక్షల నగదు, సెల్‌ఫోన్ అపహరించారు. వాటితో వెళ్లిపోతూ అపార్ట్‌మెంట్ కింద పార్కింగ్‌లో ఉంచిన యాక్టివా స్కూటర్‌నూ దొంగిలించుకుపోయారు. ఇంటి యజమాని నిద్ర నుంచి లేచిచూడగా అల్మారా, బీరువాలు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు, పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించి వేలిముద్రలు సేకరించారు. చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. ఉషశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. దీంతో పాటు మరో రెండు ఇళ్లలో చోరీకి యత్నించి విఫలమైనట్టు ఆ ఇళ్ల యజమానులు పోలీసులకు సమాచారం అందించారు.



బీరువా తలుపులు తెరిచి వున్న దృశ్యం

అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదానికి

## ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు

ధ్రువపత్రాన్ని ఆవిష్కరించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

జేఎన్టీయూకే, ఆగస్టు 27: అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపునిస్తూ జారీ చేసిన ధ్రువపత్రాన్ని మంగళవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువపత్రాలు జారీ చేసేలా తగిన చర్యలు చేపట్టాలని జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణకు సూచించారు. కాకినాడ ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఏపీలో ఎన్ఏబీఎల్, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ గుర్తింపుతో కూడిన ప్రయోగశాల జేఎన్టీయూకేలోని ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ఒకటేనన్నారు. ఈ ధ్రువీకరణ పత్రాన్ని దేవస్థానం ఈవోకు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.రమేష్, అక్నూ అనుబంధ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ హబీబ్ బాషా పాల్గొన్నారు.

## బావ మరిదిపై కత్తితో బావ దాడి

తీవ్ర గాయాలు.. కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు



అనపర్తి, ఆగస్టు 27: మండలంలోని రామవరంలో బావ మరిదిపై బావ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనునాయక్, బాధితుడి బంధువుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన తాతపూడి విజయ్‌కుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన వీరమ్మతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రామవరంలో జరిగే ఒక వేడుకలో పాల్గొనేందుకు, చెల్లిని చూసేందుకు వీరమ్మ అన్నయ్య ఖండవిల్లి ఆనంద్ మంగళవారం సాయంత్రం వచ్చాడు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న చిన్న చిన్న సమస్యలను ఆనంద్ ప్రస్తావించడంతో బావ, బావమరిది మధ్య వివాదం తలెత్తింది. కోపోద్రిక్తుడైన విజయ్‌కుమార్.. ఆనంద్‌ను కత్తితో తలపై నరకడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే బంధువులు అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆనంద్ బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో

## పిఠాపురానికి ప్రథమస్థానం

పిఠాపురం, ఆగస్టు 27: లెర్నర్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పిఠాపురం జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనపర్తిలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. ఇందులో పిఠాపురం, అనపర్తి, రాజమహేంద్రవరం జట్లు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. విజేతగా నిలిచిన పిఠాపురం జట్టు క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు అభినందించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన పిఠాపురం జట్టు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

# కలుషిత ఆహారం తిని

» గురుకుల పాఠశాల విద్యార్థినులు 72 మందికి అస్వస్థత
» ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స
» ఆసుపత్రి, వసతిగృహాలను సందర్శించిన కలెక్టర్ షాన్ మోహన్ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులు 72 మంది మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పిలతో బాధపడుతున్న వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి వసతిగృహంలో విద్యార్థినులకు మెనూలోలేని గోంగూర, వంకాయతో కూడిన కూర వడ్డించారు. కలుషిత ఆహారం వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా వైద్యులు గుర్తించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ షాన్‌మోహన్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆసుపత్రితో పాటు గురుకులాన్ని సందర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అస్వస్థతకు గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ జరిపిస్తామని కలెక్టర్ తెలిపారు. నీరు కలుషితం కాలేదని, ఆదివారం రాత్రి తీసుకున్న ఆహార పదార్థాల వల్లే అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామన్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వైద్య సేవలు అందించాలని మండల వైద్యాధికారిణి శైలజను ఆదేశించారు. పర్యటనలో తహసీల్దారు ఆర్వీ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్, డీసీహెచ్ఎస్ స్వప్న, ప్రిన్సిపాల్ చంద్ర శారద, జనసేన ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, ఎంఈవోలు బి.అబ్బాయి, వరలక్ష్మి ఆసుపత్రిలో విద్యార్థులను చూసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

**ప్రాణాపాయం లేదు: ఎస్.స్వప్న, డీసీహెచ్ఎస్**



గురుకుల పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు లోనైన మాట వాస్తవమే. వారికి ప్రాణాపాయం లేదు. కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశాలతో సత్వర వైద్య సేవలు అందించాము. బాలికలంతా క్షేమంగానే ఉన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.



విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



వసతిగృహంలో ఆయాతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు దుర్మరణం



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ భానుప్రసాద్

ఐ.పోలవరం, ఆగస్టు 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కేశనకుర్రుపాలేనికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గాదిరాజు రాజరాజు (65) మంగళవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మురమళ్లలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో కొత్త మురమళ్ల వద్ద వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఐ.పోలవరం ఎస్ఐ భానుప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాజరాజు మృతదేహాన్ని ఎమ్మెల్యే బుచ్చిబాబు చూసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రాజరాజు మృతితో కేశనకుర్రులో విషాదచాయలు అలుముకున్నాయి. సర్పంచ్ బీర సత్యకుమారి, సీహెచ్ సుబ్బరాజు, మాజీ ఎంపీపీ ఇందుకూరి పద్మకేశవరామరాజు, గాదిరాజు రామకృష్ణంరాజు, జంపన వాసురాజు, ముదునూరి లింగరాజు, చిక్కం రాంబాబు, కడియం తమ్మయ్య, నలాది శేషారావు విచారం వ్యక్తం చేశారు.

## విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురంలో ఒక వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన సగరపు సత్యనారాయణ (34) మంగళవారం పొలంలో పామాయిల్ గెలలు కోసి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యంలో చేతిలో వున్న కత్తి విద్యుత్ తీగకు తగిలి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రేపు ఐటీఐ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 27: కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 2024-25 సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న మూడో విడత అభ్యర్థులకు ఈనెల 29న గురువారం ఉదయం 8గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ పారిశ్రామికా శిక్షణా సంస్థలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు.

## పశ్చిమ బెంగాల్ సీఎం రాజీనామా చేయాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 27: కలకత్తాలో మహిళా ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనకు సంబంధించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, మీడియా ప్యానల్ దువ్వూరి సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డాక్టర్‌కు న్యాయం, సీఎం రాజీనామా కోరుతూ విద్యార్థులు చేపట్టిన బన్న అభియాన్ నిరసన ర్యాలీ హింసాత్మకంగా మారడం దురదృష్టకరమన్నారు. శాంతియుతంగా ఉద్యమిస్తున్న విద్యార్థులపై పోలీసు బలప్రయోగం చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించినా బెంగాల్ ప్రభుత్వం విద్యార్థుల ర్యాలీకి అనుమతించకపోవడం, విద్యార్థులపై వాటర్ కెనాన్లను ప్రయోగించడం, లాఠీచార్జి చేయించడం ప్రభుత్వపు దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనమని విమర్శించారు.. బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు.

## 'సీనియర్ సహాయకులుగా కొనసాగించాలి'

కలెక్టరేట్ , ఆగస్టు 27: గ్రేడ్-1 వీర్వోలను సీనియర్ సహాయకులుగా కొనసాగించేలా పదోన్నతి కల్పించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. కలెక్టరేట్ కార్యాలయంలో వీఆర్వోల సంఘం నాయకులు కలెక్టర్‌ని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి రవీంద్రరాజు మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట గ్రేడ్ వన్ వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని చెప్పానన్నారు. పలునిబంధనల కారణంగా రాష్ట్రంలో ఉన్న 650మందికిగాను 450మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని, వారిలో కొంతమందికి పరీక్షల గత ప్రభుత్వ హయాంలో చేపట్టలేకపోవడంతో 14మంది సీనియర్ సహాయకులుగా ఎంపిక కావడం జరగలేదన్నారు. 45ఏళ్లు దాటిన వారికి మాత్రమే పదోన్నతి తీసుకునేందుకు ఎటువంటి అడ్డంకులు లేవని తెలియజేస్తే ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. వారిని సీనియర్ సహాయకులుగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో అనిశెట్టి రామకృష్ణ, కేవీ సత్యనారాయన, ఏఎస్వీ తమ్మారావు, ఎంకిషోర్, పీవీ తాతారావు పాల్గొన్నారు.

## 'రీజినల్ కార్యాలయాల వ్యవస్థను రద్దు చేయాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 27: వాణిజ్య పన్నుల శాఖలో పునర్వ్యవస్థీకరణ పేరుతో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అధికార వికేంద్రీకరణ, రీజినల్ కార్యాలయాల వ్యవస్థ రద్దు చేసిన తర్వాతే బదిలీలు చేపట్టాలని ఏపీ వాణిజ్య పన్నుల శాఖ (ఏపీసీటీ) అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఏపీస్టేట్ ఏపీసీటీ సంఘం పిలుపు మేరకు మంగళవారం భోజన విరామ సమయంలో రమణయ్యపేట కాకినాడ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అసోసియేషన్ కాకినాడ డివిజన్ అధ్యక్షుడు పి.విజయకుమార్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అనిశెట్టి వీవీఎస్ స్వామిలు మాట్లాడుతూ ఆర్వో ఆఫీసులను రద్దు చేసి తిరిగి సర్కిల్ వ్యవస్థను ప్రవేశపెట్టిన తర్వాతే బదిలీలకు శ్రీకారం చుట్టాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం కోశాధికారి ఎస్ శ్రీను, సెక్రటరీ వై.గిరిష్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

## 'ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు'

కరప, ఆగస్టు 27: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడులతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్) డీపీఎం జె.ఎలియజర్ పేర్కొన్నారు. గురజనాపల్లి ఆర్బీకే కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా వచ్చే వనరులను ఉపయోగించడం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేసే పద్ధతులను వివరించారు. పెద్దాపురం డీఆర్సీ ఏడీఏ పి.మాధవి మాట్లాడుతూ రైతుల సౌలభ్యం కోసం కేంద్రప్రభుత్వం కొత్తగా క్రాప్ లైఫ్ సైన్స్, పెస్ట్ సర్వేవలెన్స్ యాప్‌లపై అవగాహన కల్పించారు. కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, కరప, కాజులూరు, తాళ్లరేవు ఏవోలు ఏవీ రాజేష్, వి.అశోక్, ప్రశాంతి, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కళాకారులకు సత్కారం

పోర్టుసిటీ కాకినాడ ఆగస్టు 27: లలిత కళల ద్వారా సమాజ సంఘటనకు సంస్కార భారతి సంస్థ కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ సంస్కార భారతి ఉపాధ్యక్షుడు వేదనభట్ల సాయిలక్ష్మి తెలిపారు. కాకినాడ ద్వారకానగర్‌లో వాదూలం సరస్వతి విద్యావేదిక కార్యాలయంలో మంగళవారం సంస్కార భారతీయ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సభకు ఆస్వాదన సాహిత్య సంస్థ వ్యవస్థాపకులు గొట్టుముక్కల వెంకట సత్యనరసింహశాస్త్రి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌వీపీ శాస్త్రి, సంగీత విద్వాంసులు విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి, ఉపద్రష్ట సుజాతలను సత్కరించారు. పంచాంగకర్త డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి సిద్ధాంతి, సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు వింజరపు జనార్దనం, కార్యదర్శి గునుపూడి సావిత్రీప్రసాద్, కోశాధికారి దీక్షితుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## '1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు'

కరప, ఆగస్టు 27: వచ్చే సెప్టెంబరు 1వ తేదీ నుంచి చేపట్టనున్న పార్టీ సభ్యత్వ నమోదు, అక్టోబరు 1 నుంచి తలపెట్టనున్న క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అనపర్తి వెంకటేష్ సూచించారు. నడకుదురులో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కాకినాడ రూరల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కె.భీమశంకర్, కన్వీనర్ పాలవతి, నాయకులు తుమ్మలపల్లి నారాయణరావు, పుట్టా వీరప్రసాద్‌గాంధీ, వనుం నాగబాబు, కె.ధనరాజు, ముమ్మిడి పెదకాపు, తదితరులు పాల్గొన్నారు.

## యువసేన అధ్యక్షుడు సతీష్‌కు గౌరవ డాక్టరేట్

పిఠాపురం, ఆగస్టు 27: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లం సతీష్‌కు బెంగుళూరుకు చెందిన సెయింట్ మదర్ థెరిస్సా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. బెంగుళూరులో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.విజయ సరస్వతి ఈ డాక్టరేట్‌ను సతీష్‌కు ప్రదానం చేశారు. మంగళవారం సతీష్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సత్కరించారు. కాకినాడలో బ్లడ్‌బ్యాంక్ నిర్వహణతో పాటు రక్తదానాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, పేదలకు వైద్యసేవలు వంటి కార్యక్రమాలు సతీష్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

## ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన ఆర్డీవో

పెద్దాపురం, ఆగస్టు 27: స్థానిక ఏడీబీ రహదారిలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆర్డీవో జె.సీతారామారావు మంగవారం పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుక నిల్వ వివరాలు, పంపిణీ ఏవిధంగా జరుగుతోంది, రవాణా చార్జీలు తదితర విషయాలపై ఆరాతీశారు. స్టాక్ పాయింట్ వద్ద ఇసుక పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఇసుక విధానాన్ని నిర్వహిస్తున్నామని, అందరికీ అందుబాటులో ఇసుక లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట డీటీ టి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 12 మందికి జైలు శిక్ష

కాకినాడ క్రైం, ఆగస్టు 27: మద్యం తాగి వాహనాలు నడిపిన 12మంది వాహనదారులకు 2 రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 12మందికి తలో రూ.10వేల వంతున రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్-1, ట్రాఫిక్-1 పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 12మందికి 2రోజుల చొప్పున, 12మందికి తలో రూ.10వేలు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## కోర్టు ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

పిఠాపురం, ఆగస్టు 27: పట్టణంలోని కోర్టులో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న అంధుడు ఎస్.సత్యనారాయణ(సతీష్) ఆత్మహత్యాయత్నం చేశాడు. పీహెచ్‌సీ కోటాలో గతేడాది కోర్టులో ఆఫీస్ సబార్డినేట్‌గా అతడు ఎంపికయ్యాడు. కొందరి వేధింపులు భరించలేక తాను ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు ఆయన చెబుతున్న వీడియో మంగళవారం వెలుగుచూసింది. అతడు తొలుత పిఠాపురం తదనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన్ను నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు, దివ్యాంగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల సురేష్, సంఘ ప్రతినిధులు శ్రీధర్, పావని,విజయలక్ష్మి పరామర్శించారు.

## రేపు వేద సభ

సామర్లకోట, ఆగస్టు 27: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో గురువారం ఉదయం శ్రీ బాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్‌తో 26వ వేద శాస్త్ర పండిత సన్మాన సభ నిర్వహించనున్నట్టు పరిషత్ కన్వీనర్ గ్రంధి సత్యరామకృష్ణ చెప్పారు. వేద సభకు పలు జిల్లాల నుంచి పలు వేదాలలో నిష్ణాతులైన పండితులు హాజరై లోకకళ్యాణార్థం హిందూ సంస్కృతి,సంప్రదాయానుసారంగా చతుర్వేద పారాయణ, వేదస్వస్తి, అనంతరం పండిత సత్కారాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమాల్లో డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, నోరి కృష్ణారావు, బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ, చుండ్రు గోపాలకృష్ణ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

## 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం, ఆగస్టు 27: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయంలో ఈనెల 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనాలని కోరారు.

# మరమ్మతులకు మోక్షమేది?

» అధ్వానంగా ఆర్అండ్‌బీ రహదారులు » ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



వర్షం నీటితో నిండిన గోతులతో అధ్వానంగా పండూరు ఆర్అండ్‌బీ రహదారి

కొత్తపల్లి, ఆగస్టు 27: కొత్తపల్లి మండలంలో గ్రామీణ రహదారులన్నీ పూర్తిగా అధ్వానంగా మారాయి. ఉప్పాడ నుంచి బీచ్‌రోడ్డుమీదుగా కాకినాడ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు, కొత్తపల్లి నుంచి పిఠాపురం, నాగులాపల్లి, మూలపేట, కోనపాపపేట వెళ్లే ప్రధాన రహదారులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా పెద్ద గోతులు కనిపిస్తున్నాయి. మోకాలు లోతు గుంతల్లో ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో గోతులు ఏర్పడ్డ రోడ్లలో కనీసం తట్ట మట్టినా పోసిన దాఖలాలు లేవు. దీంతో అప్పట్లో చిన్న గుంతలుగా పడ్డ రోడ్లన్నీ నేడు అగాధాల్లా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరింది. ఈ దారి గుండా బైక్‌లపై ప్రయాణించే పలువురు ఎక్కడ గొయ్యి ఉందో తెలియకపోవడంతో గాయాలపాలవుతున్నారు. గ్రామీణ రోడ్ల దుస్థితిపై పలు మార్లు ఫిర్యాదులు చేసినా నిమ్మకు నీరెత్తనట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రామీణ రోడ్ల దుస్థితిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి రోడ్లను త్వరితగతిన మరమ్మతులు చేపడతారనే నమ్మకంతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. మండలంలో గ్రామీణ రోడ్ల దుస్థితిపై స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టి సారించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సామర్లకోటలో విశేష అలంకరణలో మాండవ్యనారాయణస్వామి



కరపలో విశేష అలంకరణలో వేణుగోపాలస్వామి

సామర్లకోట, ఆగస్టు 27: సామర్లకోటలో పురాతన ప్రసిద్ధిపొందిన మాండవ్య నారాయణస్వామి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు, విశేష పూజలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ వల్లూరి వెంకట్రావు,సీత దంపతుల ఆధ్వర్యంలో ఆయ పండితులు చక్రవర్తుల కుటుంబీకులతో వేదమంత్రోచ్చారణల మధ్య ముందుగా నారాయణస్వామి, మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. 400 మందికి అన్నప్రసాదాలను అందజేసారు. శ్రీకృష్ణునికి అత్యంత ప్రీతి అయిన కాయం ప్రసాదాలను 500 మంది భక్తులకు అందజేశారు. అలాగే వీరరాఘవపురం రాధా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని వేటపాలెం శ్రీరామకృష్ణా ధ్యాన మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పెదబ్రహ్మదేవం గ్రామంలో గొల్లపేట యాదవ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబులు హాజరయ్యారు. వారిని యాదవసంఘ ప్రతినిధులు సన్మానించారు. తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, మామిడాల రామకృష్ణ పాల్గొన్నారు.

### కరపలో...

**కరప:** స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం శ్రీరంగంలో చేసేవిధంగా ఇక్కడ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించడం పరిపాటిగా వస్తుందని ఆలయ ప్రధానార్చకుడు పెద్దింటి అనంతాచార్యులు తెలిపారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి తులసిమాలలతో పంచామృతాభిషేకాలు తదితర పూజలను నిర్వహించారు. రాత్రికి ఉట్టి కొట్టి భక్తులకు అటుకులు, కాయం ప్రసాదాన్ని అందజేశారు. యండమూరు సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని కృష్ణావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేసినట్టు ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామం తెలిపారు. ఈవో కె.తిరుమల రవితేజ,చీర్ల శ్రీను తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## పిఠాపురంలో కృష్ణాష్టమి ఉత్సవాలు ప్రారంభం



వేణుగోపాలస్వామికి ప్రత్యేక అలంకారం

పిఠాపురం, ఆగస్టు 27: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో 3 రోజులు పాటు జరిగే కృష్ణాష్టమి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామి అమ్మవార్లకు విశేష పంచామృతాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. పుష్పాలు, నెమలి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. సాయంత్రం స్వామికి 9 రకాల ప్రసాదాలను నివేదించారు. వేడుకలు ముగింపు సందర్భంగా గురువారం ఉదయం మాస కల్యాణం, రాత్రి ఉట్ల సంబరం, గరుణవాహనంపై గ్రామోత్సవం జరగనున్నాయి. ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఈవో సున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## చదలాడలో వైద్య శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రావణి

పెద్దాపురం, ఆగస్టు 27: మండలంలోని చదలాడ గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల విష జ్వరాలబారిన పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందడంతో పులిమేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల, గ్రామ జంక్షన్ వద్ద శిబిరాలను ఏర్పాటుచేశారు. విద్యార్థులు, గ్రామస్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందచేశారు. జ్వరంతో బాధపడే అనుమానితుల వివరాలను సేకరించారు. ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## 'తడి, పొడి చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం వద్దు'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 27: నగరాన్ని క్లీన్ సిటీగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనుల తనిఖీల్లో భాగంగా కమిషనర్ దేవాలయం వీధి, రాజాజీ మంగళవారం వీధుల్లో పర్యటించారు. ఇంటింటా చెత్త సేకరణ ఎలా జరుగుతుందో తెలుసుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం వద్దని అప్రమత్తంగా ఉండాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

# అభివృద్ధిని పరుగులు పెట్టించాలి

### ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ప్రత్తిపాడులో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

ప్రత్తిపాడు, ఆగసు 27: అధికారులు, పాలకులు సమన్వయంతో పని చేసి నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా ప్రజా సమస్యలపై అంకితభావంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. మండలాభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని ఎంపీపీ సుధాకర్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, అధికారులు కుమారస్వామి, శైలజారాణి, ఎంఎన్ సత్యనారాయణ, ఎంఈవో రాజబాబు ప్రసంగించారు. సర్వసభ్యసమావేశానికి ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా విచ్చేసిన సత్యప్రభకు పాలకవర్గం ఘన సన్మానం చేసింది. మండలంలోని ఏలూరు గ్రామంలో జలజీవన్ మిషన్ రూ.40.7లక్షలతో నిర్మించే 90వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంక్, అలాగే రూ.29.7లక్షలతో 60వేల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సర్పంచ్‌లు రొంగల సత్యనారాయణ, మంతెన వెంకటరమణ, గ్రామపెద్దలు అడ్డాల త్రిమూర్తులు, జామి మాణిక్యం, రొంగల యమున, మాజీ సర్పంచ్‌లు యాళ్ల విశ్వేశ్వరరావు, పంచాది వీరబాబు, కాంట్రాక్టర్ కొత్తెం బాలకృష్ణ, శరభవరం, వాకపల్లి సర్పంచ్‌లు అమరాది వెంకట్రావు,రొంగల నాగేశ్వరరావు తదితరులున్నారు.

### సూరిబాబు సేవలు మరువలేనివి

రౌతులపూడి: టీడీపీ, గ్రామాభివృద్ధికి దివంగనేత పల్లి సూరిబాబు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ఎ.మల్లవరంలో టీడీపీ యువనేత పల్లి కుమార్ నివాసంలో సూరిబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, గవిరెడ్డి గురునాథ్, చింతకాయల శ్రీను, కోసూరి శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

### మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



కార్యకర్తలతో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, ఆగస్టు 27: టీడీపీ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. కోటనందూరు టీడీపీ నాయకులతో తేటగుంట టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో అవసరాలు, అభివృద్ధి ప్రణాళికలపై కార్యకర్తలతో చర్చించారు. ప్రజా అవసరాలే పరమావధిగా పని చేయాలని, వ్యక్తిగత ప్రయోజనాలు పక్కనపెడితే నాయకులుగా పది కాలాలుపాటు వెలుగొందుతారని పేర్కొన్నారు. మండలంలో ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించి సాగునీటి ఇబ్బందులు లేకుండా పనులు చేపడదామన్నారు. నియోజకవర్గంలో తలుపులమ్మ లోవ క్షేత్రంతో పాటుగా తుని పట్టణాన్ని ఆనుకుని ఉన్న తాండవ నది తీరాన్ని, బీచ్‌లో ఓ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌లుగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేద్దామన్నారు. టీడీపీ కార్యకర్తలపై గత ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులు తొలగించేందుకు రంగం సిద్ధమైందని కేసుల్లో ఇరుక్కున్న కార్యకర్తలు ధీమాగా ఉండాలని సూచించారు. కోటనందూరు మండల నాయకులు గాడి రాజబాబు, చిరంజీవి రాజు, వెంకట కృష్ణారావు, కొండయయనాయుడు, గొర్లి అచ్చియనాయుడు, వేగి గోపి ఉన్నారు.

# పేదల కోసం రంగబాబు నిరంతరం కృషి

### మాజీ ఎమ్మెల్యే వర్మ



గొల్లప్రోలులో రంగబాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వర్మ, టీడీపీ నేతలు

గొల్లప్రోలు, ఆగస్టు 27: పేద ప్రజల సంక్షేమం కోసం రంగబాబు నిరంతరం పనిచేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దివంగత మాదేపల్లి రంగబాబు వర్ధంతిని మంగళవారం గొల్లప్రోలులో నిర్వహించారు. రంగబాబు ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అక్కడ నుంచి ప్రదర్శనగా పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల రంగబాబు విగ్రహం వద్దకు చేరుకుని వర్మ, పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మాదేపల్లి వినీల్‌వర్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, టీడీపీ నాయకులు బస్సా సత్యనారాయణ, కడారి బాబ్జి, దువ్వా తాతాజీ, గండే నాగేశ్వరరావు పాల్గొన్నారు. బి.ప్రత్తిపాడులోని పీఎంఆర్ విద్యామందిర్‌లో రంగబాబు వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రతినిధులతో పాటు డైరెక్టరు విజయకుమార్, కరస్పాండెంట్ నాగినిచంద్ర, చైర్మన్ మాదేపల్లి వినీల్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

### లీజు గడువు పెంచాలి

గొల్లప్రోలు, ఆగస్టు 27: పట్టణంలోని రాజు చెరువులో చేపలు పట్టుకునేందుకు మత్స్యకార సొసైటీకి ఉన్న లీజు గడువు నెలాఖరుతో ముగుస్తున్నదని, ప్రభుత్వ జీవో ప్రకారం దాని గడువు పెంచాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనరు రవికుమార్‌ను కలిసి లీజు పొడిగింపులో జాప్యం ఎందుకు జరుగుతున్నదని ప్రశ్నించారు. చెరువును మత్స్యకార సొసైటీకి అప్పగించి లీజు గడువు పెంచాలని మున్సిపల్ ఆర్డీని కోరారు. టీడీపీ నాయకులు, మత్స్యకార సొసైటీ ప్రతినిధులు ఉన్నారు.

## సీఆర్‌డీఏకు డిప్యూటేషన్‌పై జేఎన్టీయూకే డీఈఈ

జేఎన్టీయూకే, ఆగస్టు 27: వర్సిటీ ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్)గా విధులు నిర్వర్తిస్తున్న జి.మోహన్‌ప్రసాద్‌ను సీఆర్‌డీఏకు డిప్యూటేషన్‌పై పంపిస్తూ ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రాజధాని నిర్మాణంలో తాను పాలు పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆయన్ను వీసీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, సీఈ వి.శ్రీనివాసులు, వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఏఈఈలు సీహెచ్.సన్నీప్రాన్సిస్, బి.నవీన్, డీ.నాగేశ్వరరావు అభినందించారు.



డీఈఈను సత్కరిస్తున్న వీసీ

## కొనసాగుతున్న సుద్దగడ్డ వరద ఉధృతి



జగనన్న కాలనీ రహదారిపై వరద నీటి ప్రవాహం

గొల్లప్రోలు, ఆగస్టు 27: సుద్దగడ్డ వరద ఉధృతి కొనసాగుతున్నది. గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై మంగళవారం 5 అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు పంటపొలాలు గట్లు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇదే మార్గంలో వెళ్తున్నారు. స్థానికంగా వర్షాలు కురవనప్పటికి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఉధృతి తగ్గడం లేదు. కాలనీకి పూర్తిస్థాయిలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## ఎమ్మెల్యే రాజప్ప ప్రత్యేక పూజలు

పెద్దాపురం, ఆగస్టు 27: మండలంలోని కట్టమూరులో పద్దాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, గోలి దొరబాబు, కర్రి వెంకటరమణ, మేడిది శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల సూర్యావతీ శ్రీనివాస్ తదితరులున్నారు.

## పోగొట్టుకున్న నగదు అందజేత

అన్నవరం, ఆగస్టు 27: శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒడిస రవికిరణ్ జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ తొందరపాటులో అన్నవరంలో దిగిపోయి వెళ్లిపోయారు. తరువాత విషయం గ్రహించి రైల్వే పోలీసులకు ఫిర్యాదుచేయగా హెచ్‌సీ శ్యామ్ విచారణ జరిపి ఆయన పరసు, వాటిలో నగదు, విలువైన పలు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రయాణికుడు కృతజ్ఞతలు తెలిపాడు.

## 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట, ఆగస్టు 27: మండలంలో జె.కొత్తూరు గ్రామ శివారున సారా బట్టీలపై ఎస్ఐ టి.రఘునాథరావు సిబ్బందితో దాడులు నిర్వహించి 600లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి పాల్పడుతున్న కేసుబోయిన వీర్రాజును అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరం

గొల్లప్రోలు, ఆగస్టు 27: పట్టణంలోని సూరంపేటలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 120 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, 50 పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు చేసి రైతులకు మందులు అందజేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గొల్లప్రోలు ఏరియా ప్రభుత్వ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టరు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, చేబ్రోలు, దుర్గాడ పశువైద్యాధికారులు డాక్టర్ ఆర్.హిమజ, డాక్టర్ టి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, ఆగస్టు 27: మండలంలో వెంగయమ్మపురానికి చెందిన మజ్జి మరిడియా ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. ఆయన వెంట మరిసే రామకృష్ణ, వల్లపు నానాజీ, కోన చినబాబు,కోటిని ధర్మరాజు, సేనాపల్లి సత్తిబాబు, అప్పన సత్యనారాయణ, దశరధ నానాజీ, మజ్జి ప్రసాద్ ఉన్నారు.

## ఎండ తీవ్రతతో సతమతం

కొత్తపల్లి, ఆగస్టు 27: మండలంలో మంగళవారం ఎండ తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు సతమతమయ్యారు. ఆకాశంలో ఎక్కడా మేఘాలు లేకపోవడంతో ఎండ తీవ్రత సాయంత్రం వరకు కొనసాగింది. వరినాట్లు పనుల్లోకి వెళ్లిన కూలీలు ఎండ తీవ్రతను తట్టుకోలేక చెట్ల నీడకు చేరి సేదదీరారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

జగ్గంపేట, ఆగస్టు 27: ప్రకృతి వ్యవసాయంపై ఏడీఏ, ఏవో, వీఏఏ, వీహెచ్ఏలకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. పచ్చదనం, జీవవైవిధ్యం, పంట వైవిధ్యం, వ్యవసాయంలో పశువులను అనుసంధానం, జీవ ఉత్ప్రేరకాల వాడకం, దేవీ విత్తనాల వాడకం పలు విషయాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయ మేనేజర్ ఏలియాజర్, ఏడీఏ గంగాధర్, ఏవో రెడ్ల శ్రీరాం తదితరులు ఉన్నారు.

## రైల్వే ప్రయాణికులకు అవగాహన

సామర్లకోట, ఆగస్టు 27: సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో రైలు ప్రయాణికులు పాటించాల్సిన భద్రతా నిబంధనలపై ఆర్పీఎఫ్ పోలీసులు మంగళవారం రాత్రి అవగాహన ఏర్పరిచారు. ప్రయాణికులు తక్కువ లగేజీతో ప్రయాణాలు చేయాలని ఆర్పీ ఎఫ్ఎస్ఐ రామకృష్ణ సూచించారు. సహచర ప్రయాణికులపై ఎవరిమీదనైనా అనుమానాలు ఉంటే స్టేషన్‌లోని రైల్వే పోలీసులకు ఫిర్యాదులు చేయాలని తెలిపారు.

## విక్షిత్ ఏపీ ప్రణాళికలపై అవగాహన

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 27: నగరపాలక సంస్థలో స్మార్ట్‌సిటీ భవనంలో పీడీ బి.ప్రియంవద అధ్యక్షతన సీఎం ప్రతిపాదించిన వీక్షిత్ ఏపీ-2047 ప్రణాళికలపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్దేశించిన బ్యాంకింగ్, సేల్స్ ఎంప్లాయిమెంట్ లక్షణాలు ఎలా సాధించాలి, డిజిటల్ ట్రాన్సిషన్‌పై లీడ్ బ్యాంక్ మేనేజర్ సీ.ప్రసాద్ అవగాహన కల్పించారు. పోలీస్ విభాగం శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.